పేదల చదువుకు అధిక ప్రాధాన్యత

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆణిముత్యాలుతో భాగంగా సత్కారం


భీమవరంలో విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాస్


ఉండి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను సత్కరించిన పీవీఎల్

సాక్షి, భీమవరం: పేదలు సైతం ఉన్నత విద్యాభ్యాసానికి వెనుకడుగు వేయకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గస్థాయిలో టెన్త్, ఇంటర్‌లో ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను గురువారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు భయపడేవారని, అప్పట్లో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడమే కారణమన్నారు. పెచ్చులూడిన పాఠశాలల భవనం శ్లాబ్‌లు, నీటి వసతి, తలుపులేని మరుగుదొడ్లు, కూర్చోడానికి బెంచీలు లేక విద్యార్థులు అవస్థలు పడేవారన్నారు. పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాడు-నేడు పథకంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. అన్ని పాఠశాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ విద్యాబోధనతోపాటు విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి జగనన్న ఆణిముత్యాల పేరిట నగదు బహుమతులు అందించడమేగాక నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సన్మానాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నామని, దీనికి ఉపాధ్యాయులు కూడా సహకారం అందించాలన్నారు.

విద్యార్థులకు సన్మానాలు

టెన్త్‌లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో మార్కులు సాధించిన భీమవరానికి చెందిన విద్యార్థులు కొట్టి కీర్తిశ్రీరంగశివాని, టి.సాయిసత్యగీతిక, వి.రమాదేవి, ఆకుల నందిని, ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో ప్రథమ స్థానాల్లో నిలిచిన పట్టణానికి చెందిన విద్యార్థులు ఎం.హారిక, డి.సుధాకర్, వి.నాని, ఎం.రాజశ్రీలకు ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రథమస్థానం విద్యార్థికి రూ.15 వేలు, ద్వితీయస్థానం విద్యార్థికి రూ.10 వేలు, ద్వితీయస్థానం విద్యార్థికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలు బహూకరించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పార్టీ నాయకులు కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, కొట్టి కుటుంబరావు, నల్లం రాంబాబు, నందమూరి ఆంజనేయులు, మునిసిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, డీవైఈవో డి.శ్రీరామ్, సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యామ్‌సుందర్, డీఐ బి.వినాయకుడు, ఎం.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పేదవాడి అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఉండిలో విద్యార్థులకు సత్కారం

ఉండి: ఉన్నత చదువుల ద్వారానే ప్రతి పేదవాడు అభివృద్ధి చెందుతాడని గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థను అద్భుతంగా మార్చివేశారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండి జెడ్పీ హైస్కూల్‌లో గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు, ఇంటర్‌లో ఆయా విభాగాల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యావ్యవస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యావ్యవస్థను సవాల్ చేస్తోందన్నారు. అందుకు తగినట్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి ఎంతోమంది నిరుపేద విద్యార్థులను గొప్పవాళ్లుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. 8వ తరగతి నుంచి విద్యార్థులకు ట్యాబ్‌లు, డిజిటల్ పాఠాలు, జగనన్న విద్యాకానుక ద్వారా పుస్తకాలు, యూనిఫాం, షూస్, టై, బెల్టు వంటివి ఉచితంగా అందిస్తున్నారన్నారు. అంతేకాకుండా జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం, అమ్మ ఒడి ద్వారా రూ.15 వేలు ప్రతి ఏటా అందిస్తున్నారన్నారు. నాడు - నేడు కార్యక్రమం ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఓ సువర్ణాధ్యాయమన్నారు. పాఠశాల వాతావరణాన్నే మార్చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారన్నారు. దీనివల్ల ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల్లో చేరి ఉచితంగా విద్యను అందుకుంటున్నారన్నారు. పేదల విద్య కోసం సీఎం వైఎస్ జగన్ కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా జగనన్న ఆణిముత్యాల ద్వారా ప్రథమస్థానాల్లో నిలిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అలాగే ఉండి జెడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి, బోధన కోసం ఉత్తమ ఉపాధ్యాయులను నియమించారని, బాలికలు గమనించి చేరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, కమతం బెనర్జీ, జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంఈవో ఎ.రవీంద్ర, ఉండి, ఆకివీడు ఎంపీడీవోలు ఏవీ అప్పారావు, వాణీ, హెచ్ఎం రామలక్ష్మీ పాల్గొన్నారు.

గడపగడపలో నెరవేరుతున్న హామీలు


కలవపూడిలో అభివృద్ధి పనులపై స్థానికులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కలవపూడి గ్రామంలో ఇచ్చిన హామీల మేరకు చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం పీవీఎల్ పరిశీలించారు. కలవపూడి పరిధిలో వావిలాలపాడు, మోదీ గ్రామంలో సుమారు రూ.పది లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటిచ్చారంటే ఎన్ని కష్టాలు ఎదురైనా నెరవేర్చి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడే ఉండే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య అవసరం


మోగల్లు లో ఆటపాటలతో చిన్నారులకు విద్యను నేర్పిస్తున్న ఐసీడీస్ సూపర్‌వైజర్ పార్వతి

పాలకోడేరు: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. జన భాగీధర్ కార్యక్రమంలో భాగంగా మోగల్లు, బంటుమిల్లి తదితర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో రంగులు, ఆటపాటలతో వివిధ యాక్టివిటీస్‌పై చిన్నారులకు గురువారం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. స్కూల్‌కు వెళ్లే ముందు, చిన్నారులకు విద్య నేర్చుకునే వాతావరణ పరిస్థితులను కల్పిస్తామన్నారు. అంతేకాక వారి ఆరోగ్య సంరక్షణ చూస్తామని, పౌష్టికాహార లోపాన్ని నివారిస్తామని, ఆరోగ్య వంతమైన సమాజానికి పునాదులు అంగన్‌వాడీ నుంచే ప్రారంభమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు విమల, చంద్రకుమారి, దేవి, రాధ, నాగలక్ష్మి, జ్యోత్స్న మంగతాయారు, సుబ్బలక్ష్మి ఎంపీటీసీ సభ్యులు సూర్యకళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాలా కుమారి, ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎం అంగన్‌వాడీ ఆయా లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పాలకోడేరులో దిశ యాప్‌ను ఫోన్లో డౌన్లోడ్ చేయించి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాలకోడేరు: దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకుని ఆపత్కాలంలో పోలీసుల నుంచి రక్షణ పొందాలని ఎస్సై నాళం శ్రీనివాసరావు కోరారు. ఎస్పీ యు.రవి ప్రకాష్ ఆదేశాల మేరకు మండలంలో రెండో రోజు గురువారం దిశ యాప్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ యువతులు, మహిళలకు దిశ యాప్‌ను ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించారు. దిశ యాప్‌లో ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులతో మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల రక్షణ కోసం తీసుకువచ్చిన దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాలని కోరారు. ఆపదలో ఉన్నవారు ఎస్ఓఎస్ బటన్ నొక్కి షేక్ చేసి దిశ యాప్‌తో ఎంతోమంది రక్షణ పొందారని, దిశ యాప్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఏఎస్సై డీవీవీ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, మహిళా కానిస్టేబుల్ భవాని, పూర్ణిమ, శ్రీదేవి లలిత, కోనాల బేబీ, బొక్కా నాగలక్ష్మి, కృష్ణవేణి, భవాని ఉన్నారు

ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, భీమవరం: రాష్ట్రంలోని కడప స్పోర్ట్స్ స్కూల్లో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎం.రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతిలో బాలికలు 20, బాలురు 20, ఐదో తరగతిలో బాలికలు 7, బాలురకు 4 సీట్లు ఉన్నాయన్నారు. దీనికిగాను శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు మండల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులకు ఎంపిక పరీక్షలు నిర్వహించాలని, పరీక్షలో 8 పాయింట్ల కంటె ఎక్కువ సాధించిన క్రీడాకారులను ఈనెల 23న భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో నిర్వహించే జిల్లా స్థాయి ఎంపికలకు తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయి పరీక్షలో 13 పాయింట్ల కంటే ఎక్కువ సాధించిన క్రీడాకారులకు ఈనెల 29, 30 తేదీలలో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు అర్హత సాధిస్తారని రమేష్‌బాబు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు వారి ప్రతిభ ఆధారంగా ఇంటర్మీడియట్ వరకు ఉచిత వసతితో విద్యనందించి క్రీడల్లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. 4వ తరగతిలో చేరడానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్లో 3వ తరగతి పూర్తిచేయాలని, అలాగే 2014 ఆగస్టు 1వ తేదీ నుంచి 2015 జూలై 31వ తేదీ లోగా జన్మించి ఉండాలన్నారు. 5వ తరగతిలో చేరడానికి గుర్తింపు పొందిన స్కూల్లో 4వ తరగతి పూర్తి చేసి 2013 ఆగస్టు 1వ తేదీ నుంచి 2015 జూలై 31వ తేదీ లోపు జన్మించినవారై ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం 94403 75277 సెల్ నంబర్‌లో సంప్రదించాలని రమేష్ బాబు కోరారు.

కోర్టు ఆదేశాలు ఉల్లంఘించారంటూ ఫిర్యాదు


కుప్పనపూడిలో చేపల చెరువులో నీరు నింపుతున్న దృశ్యం

ఆకివీడు: కోర్టు ఆదేశాల్ని ఉల్లంఘించి చేపల చెరువులో నీరు నింపుతున్నారని మండలంలోని కుప్పనపూడి గ్రామ మాజీ సర్పంచ్ మోటుపల్లి రాజు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు గురువారం విలేకర్లకు తెలిపారు. గత పదిహేను రోజులుగా అనుమతి లేకుండా చెరువు తవ్వుతున్న సంఘటనపై స్పందనలో ఫిర్యాదు చేశామని, ఆర్డీఓ వచ్చి పరిశీలించి, చెరువులో తదుపరి పనులు చేపట్టవద్దని ఆదేశాలిచ్చారన్నారు. అయినప్పటికీ చెరువు తవ్వకం పనులు జరుగుతుండటంతో కోర్టును ఆశ్రయించానన్నారు. చెరువు తవ్వకం పనుల్ని నిలుపుదల చేశామని తహశీల్దార్ కోర్టుకు తెలిపారని, అయినప్పటికీ పనులు పూర్తి చేసి బుధవారం నుంచి చెరువులో నీరు నింపుతున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఈ విషయాన్ని కోర్టుకు కూడా తెలియజేస్తానని చెప్పారు. చెరువులో నీరు నింపే పనిని నిలుపదల చేయాలని వీఆర్వోను ఆదేశించామని, నీరు తోడే మోటారును నిలుపుదల చేయించినట్లు తహశీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు.

పట్టణ సుందరీకరణకు దాతల సహకారం భేష్


ఎడ్వార్డ్ ట్యాంకు సుందరీకరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణం సుందరీకరణకు దాతలు, వ్యాపారులు, విద్యా సంస్థలు, క్లబ్‌లు తదితరులు సహకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పెద్ద పోస్టాఫీసు వద్ద ఎడ్వర్డ్ ట్యాంక్‌ను దాత జూపూడి సంజయ్ (ఎన్ఆర్ఐ), రోటరీ క్లబ్ సంయుక్తంగా రూ.40 లక్షలతో సుందరీకరణ చేయనున్నారు. ఈ పనులకు సంబంధించి గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శంకుస్థాపన పూజలు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎడ్వర్డ్ ట్యాంకును సుందరీకరణ చేయడానికి సహకరిస్తున్న దాతలను అభినందించారు. ఎడ్వార్డ్ ట్యాంకు సుందరీకరణతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. దీనిలో లైటింగ్ తదితర పనులకు మున్సిపల్ నిధులు కూడా ఉపయోగించుకుని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాకు మొదటి జిల్లా కలెక్టర్‌గా, మున్సిపాలిటి ప్రత్యేక అధికారిగా ఉన్న పి.ప్రశాంతి పట్టణ అభివృద్ధి, సుందరీకరణ పనులను వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జూపూడి విశ్వనాథ దంపతులు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, తహసీల్దార్ వై.రవికుమార్, రోటరీ అధ్యక్షులు గుండు కిషోర్, కార్యదర్శి హషుఖ్ లాల్ జైన్, కోశాధికారి బొండా వెంకట సుబ్బారావు, గూడూరి ఉమాబాల, తోట భోగయ్య, కామన నాగేశ్వరరావు, నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని ధర్నా


డీఆర్వో కృష్ణవేణికి వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: పెనుగొండ మండలం చినమల్లం, తాళ్లపాలెం, మిద్దేవారి పాలెం, నడిపూడి గ్రామాలను ఆనుకుని ఉన్న పంట పొలాల మధ్య తవ్వుతున్న ఆక్వా చెరువులను తక్షణం నిలుపుదల చేయాలని కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు మామిడిశెట్టి రామాంజనేయులు, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మూడు గ్రామాల పరిధిలో మురుగు కాలువలు లేని వరిసాగు చేస్తున్న 600 ఎకరాల్లో ఆక్వా సాగుకు అనుమతించడం దారుణమన్నారు. అక్రమంగా తవ్వుతున్న చెరువుల కారణంగా కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదంతో పాటు తాగునీరు కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం అనుమతులు రద్దు చేసి చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో కె.కృష్ణవేణికి అందజేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు, సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కె.సూర్యనారాయణ, ఇ.రాము, కె.వెంకటనారాయణ పాల్గొన్నారు.

పేదవాడి గౌరవాన్ని కాపాడిన సీఎం


నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకట సోమరాజు

ఉండి: ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఏర్పాటు చేసి సమాజంలో వారి గౌరవాన్ని కాపాడిన మహోన్నత నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చిలుకూరు సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు అన్నారు. గురువారం చిలుకూ రు జగనన్న లేఅవుట్‌లో కుంచనపల్లి శ్యాంబాబు, పూజ దంపతులు నిర్మించుకున్న నూతన గృహాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఇంతగా ప్రేమించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి నాయకుడిని ఇంతవరకు చూడలేదన్నారు. ఎంతోమంది పాలకులు వచ్చినా నిరుపేదలను పట్టించుకోలేదన్నారు. పేదలకు లక్షలాది రూపాయల విలువ చేసే ఇంటి స్థలాన్ని ఇవ్వడమే కాక ఇల్లు కట్టుకునేందుకు రుణాన్ని అందించి, లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న జగనన్నకు లబ్ధిదారులంతా రుణపడి ఉన్నారన్నారు. ఇరుకైన అద్దె ఇళ్లల్లో ఎన్నో బాధలు పడిన వారంతా ఇప్పుడు హాయిగా తమ సొంత ఇంట్లో జీవిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రిని ఆశీర్వదించి ఆయన రుణం తీర్చుకోవాలన్నారు. మాజీ ఉపసర్పంచ్ కృష్ణంరాజు, స్థానిక సీఆర్ యువరాజు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకంతో తీవ్ర నష్టం

సాక్షి, భీమవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే తీవ్రంగా నష్టపోతారని భీమవరం సెబ్ సీఐ వీవీవీఎస్ఎన్ వర్మ అన్నారు. భీమవరం తిరుమల విద్యాసంస్థల్లో గురువారం ఏబీవీపీ, సెబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండడమేగాక దానివల్ల కలిగే అనర్థాలను ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సెబ్ ఎస్సై జి.సునీల్‌కుమార్, మడిపల్లి శేఖర్, ఏబీవీపీ భీమవరం భాగ్ కన్వీనర్ కె.దిన్ను, నగర కార్యదర్శి కె.విష్ణు, ఉపాధ్యక్షుడు బి.మణికంఠ, వి.దేవేంద్ర పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

కాళ్ల: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.లక్ష్మి అన్నారు. గురువారం కాళ్ల, సీసలి, ఏలూరుపాడు, కాళ్లకూరు, జక్కరం, కోపల్లె, జువ్వపాలెం, పెదఅమిరం బొండాడ, తదితర గ్రామాల్లో పలు షాపులు, కర్మాగారాల్లో బాలకార్మికుల గుర్తింపు కోసం కార్మిక శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక బాల కార్మికుడిని గుర్తించి సంబంధిత యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా మరో ఇద్దరు బడిబయట పిల్లలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ 16 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై బాలకార్మిక నిషేధ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. భీమవరం -1,-2 సర్కిల్ లేబర్ ఆఫీసర్లు కె.శివనాగమల్లేశ్వరరావు, ఎస్.దుర్గారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, సీఆర్పీ వెంకన్నబాబు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్ పరిశీలన

పాలకోడేరు: మండలంలోని పాలకోడేరు, మోగల్లు గ్రామాలలోని జగనన్న లే అవుట్‌లో స్థలాలను భీమవరం ఆర్డీఓ దాసి రాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పొంది త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీవో నూకల మురళీ గంగాధర్‌రావు ఉన్నారు.

వృద్ధుల రక్షణకు ట్రిబ్యునల్ తీర్పులు అమలు చేయాలి

ఆకివీడు: వృద్ధులకు రక్షణపై ట్రిబ్యునల్ తీర్పులను అన్ని మండలాల్లో అమలుజేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. చట్ట ప్రకారం ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి వలంటీర్ వృద్ధుల యోగ క్షేమాలు తెలుసుకునే విధంగా వారికి తగిన సూచనలివ్వాలని కోరారు. సంఘ కార్యదర్శి అడవి సుబ్బారావు, పేర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం: పెదగరువు విద్యుత్ ఉపకేంద్రం నుంచి తుందుర్రు వైపు 33/11 కేవీ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. తుందుర్రు, జొన్నలగరువు, దూసనపూడి, మత్స్యపురిపాలెం, కమతాలపల్లి, బాలేపల్లి, గ్రామాలతో పాటు తుందుర్రు గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్‌నకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్టరేట్‌కు ఫర్నిచర్ వితరణ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన సామగ్రిని దాతలు అందివ్వడం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారిణి కె.కృష్ణవేణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కొత్తపల్లి కోదండరామ గాంధీరాజు సహకారంతో కలెక్టరేట్‌లోని శాఖల కార్యాలయాలకు సామగ్రి అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దాత, ఆధ్యాత్మికవేత్త కొత్తపల్లి కోదండరామ గాంధీరాజు సహకారంతో సుమారు రూ.50 వేలు విలువైన 25 కుర్చీలు, 3 ఇనుప ర్యాక్ బీరువాలను జిల్లా ఫైర్ కార్యాలయం, డీఈవో కార్యాలయానికి ఈ సామగ్రిని అందించామని తెలిపారు. ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ నారాయణ, ఏవో కుమార్‌స్వామి, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

హీరో ప్యాషన్ ప్లస్ వాహనం ఆవిష్కరణ


భీమవరం షోరూమ్‌లో హీరో ప్యాషన్ ప్లస్ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని రెడ్డి అండ్ రెడ్డి ఆటోమొబైల్స్ షోరూమ్‌లో గురువారం హీరో ప్యాషన్ ప్లస్ 100 సీసీ వాహనాన్ని ఆర్‌టీవో ఉమామహేశ్వరరావు, మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు చంద్రమౌళి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ ఎండీ గొలుగూరి వెంకటరెడ్డి, మేనేజర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్యాషన్ ప్లస్ వాహనాన్ని కుటుంబ సభ్యులకు, యువతకు నచ్చేలా తీర్చిదిద్దినట్లు చెప్పారు. వాహనంలో మొబైల్ చార్జింగ్ పోర్ట్, త్రీడీ గ్రాఫిక్స్, డిజిటల్ ఎనలాగ్ మీటర్, సైడ్‌స్టాండ్ కటాఫ్ ఫీచర్ వంటి అత్యాధునిక టెక్నాలజీ పొందుపర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ హెచ్ఆర్ శివ, వర్క్‌షాప్ మేనేజర్ సతీష్, నెట్‌వర్క్స్ మేనేజర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

శివయ్య ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో వేంచేసియున్న శ్రీ ఉమా సోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానంలో లోకకల్యాణార్థం శ్రీస్వామి వారికి సహస్రఘటాభిషేకం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకకల్యాణార్థం పరమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శివయ్య ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, కొయ్యే సుందరరాజు, తోట భోగయ్య, కోడే యుగంధర్, ఈవో చాగంటి సురేష్‌నాయుడు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు కుర్మదాసు సత్య శ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, నల్లం రఘుబాబు పాల్గొన్నారు..

18న ఉచిత హోమియో వైద్యశిబిరం

సాక్షి, భీమవరం: పట్టణంలో ఈనెల 18న ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హోమియో వైద్యుడు చింతా రవీంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఉండి రైల్వేగేటు సమీపంలో ఎస్ఎస్‌బీ హోమియో స్టోర్స్ అండ్ క్లినిక్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. రోగులకు ఉచితంగా పిల్స్, డ్రాప్స్ ఇస్తామని, ఈ అవకాశాన్ని భీమవరం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రవీంద్ర కోరారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పెంచాలి

ఆకివీడు: ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పెంచాలని, వేతనాలకు సరిపడేలా పనిదినాలుండాలని డ్వామా ఏపీఎం విజయలక్ష్మీ సూచించారు. అజ్జమూరులో ఉపాధి పనులను గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. పంట బోదె పూడిక తీత పనులలో గట్టులంక పనులు, పారలతో మొక్కల్ని తొలగింపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఉపాధి పనుల్ని ప్రతి రోజూ నాలుగు గంటల పాటు సక్రమంగా చేస్తే రూ.270 వేతనం వస్తుందని చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ ఉన్నారు.